క్లుప్తంగా

రైతుల ఆరాధ్య దైవం బలరాముడు



మాచవరం పోతాయిలంకలో బలరామునికి పూజ చేస్తున్న రైతులు

అంబాజీపేట: వ్యవసాయ రంగంలో రైతులందరికీ ఆరాధ్య దైవం బలరాముడేనని బీకేఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు జలగం కుమార స్వామి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. మాచవరం శివారు పోతాయిలంక బీకేఎస్ కార్యాలయం వద్ద బలరామ్ జయంతి వేడుకలను బీకేఎస్ నాయకులు, రైతులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కల్యాణ్‌శర్మ ఆధ్వర్యంలో ముత్యాల సత్యనారాయణ బలరాముని విగ్రహం వద్ద హల పూజ, గోపూజ, బలరామ పూజలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ బలరామ జయంతి వేడుకలను జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో బలరామ్ జయంతి వేడుకలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు బొక్కా ఆదినారాయణ, అడ్డాల గోపాలకృష్ణ, యాళ్ల వెంకటానందం, మాకిరెడ్డి పూర్ణిమ, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు



స్వామికి నిర్వహిస్తున్న అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా జుల్జన్ కార్యక్రమం

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ వాహనమైన గుర్రాన్ని ప్రత్యేకంగా అలంకరించి దానికి ప్రత్యేక పూజలు చేశారు. కర్బలా పుణ్యభూమిలో హజరత్ ఇమామ్ హుస్సేన్‌కు యుద్ధంలో తోడుగా నిలిచిన గుర్రం జుల్జన్‌ను స్మరిస్తూ నగరం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్రాన్ని ఊరేగిస్తూ మాతం నిర్వహించారు. అంజుమనే పర్వానయే హుస్సేన్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మత ప్రబోధకులు షమీమ్ రజా రజ్వి మజ్లిస్ ఆలపించారు. ముస్లింల ఎనిమిదో ప్రవక్త హజరత్ ఇమామ్ రజా సోదరి మాసుమే కుం షహదత్‌ను పురస్కరించుకుని కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని కర్బలా అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

సభ్యత్వాలు నమోదు చేయించాలి

అంబాజీపేట: అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. మొసలపల్లిలో నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కముజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నీరు మళ్లింపునకు కార్యాచరణ



పాశర్లపూడిబాడవ సత్తరువుతోట డ్రైన్‌లో పూడిక తొలగింపు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ సత్తరువుతోటలో ముంపు నీటి మళ్లింపునకు గ్రామ పంచాయతీ సోమవారం కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా పూడుకు పోయిన డ్రెయిన్‌ను జేసీబీ సహాయంతో బాగు చేశారు. డ్రెయిన్‌లో పూడికను తొలగించి ముంపు నీటి పారుదలకు ఏర్పడిన ఆటంకాన్ని తొలగించారు. గ్రామ సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన పనులను మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ పాల్గొన్నారు. సత్తరువుతోట కాలనీ వాసులు ముంపు నీటి సమస్యపై ఆదివారం నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

లంకభూముల నదీపాతం



పులిదిండి సమీపంలో నదీపాతం అవుతున్న లంకలు



పేరవరం వద్ద నదీ కోతకు గురవుతున్న లంక భూములు

- గోదావరిలో కలసిపోతున్న లంక భూములు
- లబోదిబోమంటున్న రైతులు

ఆత్రేయపురం: గౌతమి, వశిష్ట మధ్య గోదావరి లంక రైతులు తమ పంట పొలాలు నదీకోతకు గురవుతున్నాయని లబోదిబోమంటున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో బొబ్బర్లంక వద్ద గౌతమీ కుడిగట్టు, వశిష్ట ఎడమగట్టు ప్రాంతంలో లంక భూములు కోతకు గురవుతున్నాయి. ఆత్రేయపురం మండలంలో పులిదిండి, బొబ్బర్లంక, రాజవరం, పేరవరం గ్రామాల్లో నదీకోతకు గురవుతున్నాయి. ముఖ్యంగా పులిదిండి సమీపాన గత కొన్నేళ్ల నుంచి వరదలకు లంక భూములు నదీపాతానికి(కోత)కు గురి కావడంతో, విద్యుత్ మోటార్లతో పాటు కొబ్బరి చెట్లు నదీపాతమై నష్టపోతున్నామని అయినా తమను ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పులిదిండి ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న సుమారు 100 ఎకరాల జిరాయితీ, ఎస్సీలకు చెందిన పంట భూములు సేద్యం చేస్తున్నారు. అయితే గత కొన్నేళ్ల నుంచి గోదావరి కోతకు గురవడంతో పంట భూములు నదీ గర్భంలో కలసి పోతున్నాయి. కొబ్బరిచెట్లు, సుమారు 50 విద్యుత్ మోటార్లు పంట భూములు నదిలో కలసిపోయి తీవ్రనష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు గురికాకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రోయిన్లతో రివిట్‌మెంట్ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే గౌతమీ ఏటుగట్టుకు సంబంధించి మండల కేంద్రం ఆత్రేయపురంలో 12 కిలోమీటర్ నుంచి 13 కిలోమీటర్ వరకు నదీ కోతకు గురవుతుందని, బొబ్బర్లంక సమీపాన 850 నుంచి 2 కిలోమీటరు వరకు నదీ కోతకు గురవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించి పరిశీలించి వెళుతున్నారు తప్ప ఫలితం ఉడటం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే తాడిపూడి వసంతవాడ, పులిదిండి, రాజవరం గ్రామాల్లో సైతం లంక భూములు అండలుగా జారి లంకభూములు కనుమరుగవుతున్నాయి. వెంటనే లంక భూములు కోతకు గురి కాకుండా గ్రోయిన్లు నిర్మించాలని ఈప్రాంత రైతులు కోరుతున్నారు.

గ్రోయిన్లు నిర్మించాలి



వరుసగా వచ్చిన వరదలతో ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో లంక భూములు కోతకు గురై పంట పొలాలు గోదావరిలో కలసిపోతున్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన చోట గ్రోయిన్లు ఏర్పాటు చేయాలి

– కనుమూరి శ్రీనివాసరాజు, పులిదిండి

నదిలో కలసిపోతున్నాయి



కొన్నేళ్ల నుంచి గోదావరి కోతకు గురవడంతో పంటభూములు నదీ గర్భంలో కలసిపోతున్నాయి. కొబ్బరి చెట్లు, విద్యుత్ మోటార్లు, పంట భూములు నదిలో కలసిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కోతకు గురి కాకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు గోయిన్లతో రివిట్‌మెంట్ చర్యలు చేపట్టాలి

– వెంపాటి కృష్ణమూర్తి, పేరవరం

చట్టాలను అవగాహన చేసుకోవాలి

కొత్తపేట: విద్యార్థులు చట్టాలను అవగాహన చేసుకోవాలని లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానల్ అడ్వకేట్ బి.బాలప్రతాప్ సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ యాక్ట్, విద్యా హక్కు, దిశ, పోక్సో చట్టాలు, బాలికల అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో కూటమి విఫలం



చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: ఉమ్మడి, విభజన ఏపీ రాష్ట్ర చరిత్రలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను ఆదుకోవడంలో నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, నిన్నటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేశాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ విజయవాడ వరదలకు ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయంలో వాతావరణ శాఖ, నీటిపారుదల విభాగం ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షిత ప్రదేశాలకు వంటివి తక్షణం చేపట్టాలన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ విషయంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయలేదని, సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. కేవలం సీఎం చంద్రబాబునాయుడు ఇల్లు మునిగిపోకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారని ఆరోపించారు. దీనివల్లే ఇంత ఘోరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. వరదలు ముంచెత్తిన తర్వాత ప్రజలు తమకు తాముగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నం చేశారని, ఈ క్రమంలోనే 50 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అధికారులను వెంట వేసుకుని తిరగటం తప్ప వారికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం ఎక్కడా చేయలేదన్నారు. రోజుకు మూడు నాలుగు సార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి అంతా తానే చేస్తున్నట్టు భ్రమ కల్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను ఆపద సమయంలో ఆదుకునే విషయంలో జగన్ ప్రభుత్వానికి, నేటి చంద్రబాబు ప్రభుత్వానికి నక్కకు.. నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉందన్నారు. అది నేడు విజయవాడలో ఏర్పడిన విపత్తులో కనిపించిందన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి ఆ చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

రైల్వే లైన్ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు



నగరంలో సర్వేను అడ్డుకుంటున్న సర్పంచ్ రమణకుమారి, గ్రామస్తులు

మామిడికుదురు: నగరం గ్రామంలో కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే చేసేందుకు వచ్చిన ఉద్యోగులను గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారితో పాటు స్థానికులు సర్వే చేసేందుకు వచ్చిన సిబ్బందిని అడ్డుకుని తమ సమస్యలను, ఇబ్బందులను విన్నవించారు. పాత సర్వే లైన్ ప్రకారం రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ప్రతిపాదిస్తున్న ప్రాంతం మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే గ్రామంలో 73 ఎకరాల పంట భూములు, దానికి ఇరువైపులా ఉన్న వందలాది ఎకరాల సారవంతమైన భూములు నాలుగు కిలోమీటర్ల మేర కోల్పోవలసి వస్తుందని జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్, ముకరం హుస్సేన్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో సర్వే చేసిన ప్రాంతం మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే ఎవరికి ఏ విధమైన అభ్యంతరం ఉండదన్నారు. కానీ కొత్తగా రైల్వే లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన మార్గం మీదుగా రైల్వే లైన్ వేస్తే నగరం గ్రామానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ వల్ల ఇప్పటికే గ్రామానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు మళ్లీ రైల్వే లైన్ గ్రామం మధ్య నుంచి వేస్తే ఇక నగరం గ్రామం మనుగడను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రాణాలైనా అర్పిస్తాం, కానీ సర్వే జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో సర్వే కోసం వచ్చిన ఉద్యోగులు వెనుతిరిగి వెళ్లిపోయారు. అనంతరం కలెక్టర్‌కు రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో బత్తుల జనార్దనరావు, వానరాశి ప్రసాద్, కడలి బాబూరావు, రాయుడు ఆనంద్, రాయుడు శ్రీను, జాలెం తాతారమేష్ పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం



పెదపట్నంలంకలో గణపతి హోమంలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పెదపట్నంలంక దుర్గా సెంటర్ రామాలయం వద్ద గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. శిరిగినీడి దుర్గారావు, ఈశ్వరిలక్ష్మి, బొరుసు దుర్గారావు, జ్యోతి దంపతులు కర్తలుగా పాల్గొని హోమం జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. లూటుకుర్రు బాల గణపతి ఆలయం వద్ద అడబాల తాతకాపు, చక్రావతి దంపతులు విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పలు ఆలయాల వద్ద వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కుంకుమ అలంకరణలో గణపతి

అంబాజీపేట: గణపతి నవరాత్రుల సందర్భంగా అంబాజీపేట మండలంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ఇసుకపూడి, చిరతపూడి, నందంపూడి, మాచవరం, తొండవరం, వాకలగరువు తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన చవితి పందిళ్లలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగలకుర్రు పెదగరువులో అన్నసమారాధన చేపట్టారు.

రోడ్లు ఇలా... ప్రయాణం ఎలా..?



అధ్వాన స్థితిలో పెదపట్నం ఏటిగట్టు రోడ్డు

మామిడికుదురు: కొద్దిపాటి వర్షానికే రోడ్లు అడుసు నేలలను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపై బైక్ వేసుకుని వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. కొన్ని రోడ్ల పరిస్థితి ఈ విధంగా ఉండగా... మరికొన్ని రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఈ గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు మెటల్ రోడ్డు సుమారు రెండొందల మీటర్ల మేర అడుసు తరహాలో మారిపోయింది. మెటల్ రోడ్డుపై భారీగా మట్టి చేరడంతో వర్షానికి బైక్‌లు జారిపోయి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక మహిళలు అయితే ప్రాణం అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతే సంగతులు. ఏటిగట్టు నుంచి కాలువలోకి జారిపోయే పరిస్థితి. ఇక పెదపట్నం గ్రామంలోని బాబా నగర్ నుంచి రత్నాపురం వెళ్లే ఏటిగట్టు రోడ్డు పరిస్థితి కూడా ఇంతే. ఈ రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఈ గోతుల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. మధ్యలో గట్టు తరహాలో ఉన్న మార్గంలోనే వాహనదారులు భయం గుప్పెట్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇక్కడ కూడా మూడొందల మీటర్లు పొడవు ఉంటుంది. ఈ రెండు రహదారుల అభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

యువకుని రక్షించిన సీఐ



అలమూరు గౌతమి బ్రిడ్జిపై రక్షించిన యువకుడితో పోలీసులు

అలమూరు: మండలంలోని జొన్నాడ గౌతమి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోబోయిన ఓ వ్యక్తిని రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ కాపాడిన సంఘటన సోమవారం జరిగింది. అలమూరు పోలీసులు కథనం ప్రకారం విధి నిర్వహణలో భాగంగా పని ముగించుకుని వాహనంపై జొన్నాడ మీదుగా రావులపాలెంలోని తన కార్యాలయానికి వెళుతున్నారు. ఆ సమయంలో కడియం మండలం పొట్టిలంకకు చెందిన పెద్దిరెడ్డి మణికుమార్ అనే యువకుడు గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్నాడు. సంఘటనను గమనించిన సీఐ సత్వరమే స్పందించి మణికుమార్‌ను ఆత్మహత్యాయత్నం నుంచి విరమింపజేశారు. ఆ వ్యక్తిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించి ఆత్మహత్య చేసుకునేందుకు దారి తీసిన సంఘటలను అడిగి తెలుసుకున్నారు. ఆ విచారణలో కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన మణికుమార్‌కు ప్రస్తుతం మానసికస్థితి సరిగా లేదని నిర్ధారణకు వచ్చారు. అనంతరం మణికుమార్ సోదరుడు దుర్గాప్రసాద్‌ను రప్పించి మణికుమార్ అప్పగించినట్లు ఎస్సై ఎం.అశోక్ తెలిపారు. తన తమ్ముడు ప్రాణాలను కాపాడిన సీఐకు దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పాలంకరణలో విఘ్నేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారు చవితి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు అయిన సోమవారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షగరిక పూజ, శ్రీలక్ష్మీ గణపతిహోమం వంటి ప్రత్యేక పూజలు జరిపారు. పంచహారతులు ఇచ్చారు. స్వామిని వివిధ పుష్పాలతో కనుల విందుగా అలంకరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి వైపీ ప్రియాంక ఆధ్వర్యంలో 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

విజయవాడ వరద ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమే



గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: విజయవాడ వరదకు ప్రధాన కారణం ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమేనని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరదలు వస్తున్నట్లు అధికార యంత్రాంగం గుర్తించి ప్రభుత్వానికి సమాచారం ఇస్తుందని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కానీ చంద్రబాబు నివాసం మునగకుండా కాపాడేందుకు బుడమేరు రెగ్యులేటర్ తెరిచి నగరంలోకి వరద నీటిని వదిలేయడం దారుణమైన చర్య అని అన్నారు. కనీసం ప్రాణనష్టం నివారణకు చర్యలు తీసుకోలేని ప్రభుత్వం ఇదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా విజయవాడలో అనేక మంది ప్రాణాలు పోవడంతో పాటు కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. ఇందుకోసం కారకులపై హత్యా నేరం నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా సొంత ప్రయోజనాల కోసం పని చేస్తున్న ఈ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. సీఎం చంద్రబాబుకు పబ్లిసిటీ పిచ్చి ఎక్కువ అని అధికారులను వెంట వేసుకుని ప్రెస్ మీట్లు పెట్టడం తప్ప వరద బాధితులను ఆదుకోవడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. బాధితులందరికీ పూర్తి న్యాయం చేసే వరకూ వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు.

నేడు వాడపాలెంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం వంతెన సెంటర్ గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో మంగళవారం రాత్రి పలు పౌరాణిక రంగస్థల నాటకాల్లోని వివిధ ఘట్టాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు కళా ప్రోత్సాహకులు, ప్రదర్శనల నిర్వహణ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కళా ప్రోత్సాహకులు గొలకోటి రాజు, సింగిరెడ్డి గోవిందుస్వామి విలేకరులతో మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్న ప్రదర్శనలకు భిన్నంగా ఈ ఏడాది మూడు నాటకాల్లోంచి నాలుగు సీన్లు ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. కురుక్షేత్రం నాటకంలో దుర్యోధనుడి మయసభ ఏకపాత్రాభినయం (దంపూరి దుర్గాప్రసాద్, తణుకు), దేవనర్తకి నాటకంలో భవానిశంకరుడు, చింతామణి సీను (జాడీవీ సుబ్బారావు, పెడన- రత్నశ్రీ, కడప), సత్యహరిశ్చంద్ర నాటకంలో వారణాసి సీను (హరిశ్చంద్ర జాడీవీ, చంద్రమతిగా రత్నశ్రీ, నక్షత్రకుడిగా షణ్ముఖి విజయరాజు), అదే నాటకంలో కాటి సీను (పీవీ కృష్ణ చైతన్య, రత్నశ్రీ) ప్రదర్శనలు ఏర్పాటు చేశామని తెలిపారు. కళా పోషకులు, కళా ప్రోత్సాహకులు, కళాభిమానులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పై నాటక ప్రదర్శనలను జయప్రదం చేయాలని కోరారు.

16న ఏకాదశ రుద్రాభిషేకం

అంబాజీపేట: సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా అంబాజీపేట బస్టాండ్ పక్కన వాసవీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 16న మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థ సభ్యులు తెలిపారు. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేద అధ్యయన విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఉదయం 6 గంటలకు శోభాయాత్ర, 7 గంటలకు ప్రశాంతి పతాక ఆవిష్కరణ, గోమాత పూజ, మొక్కలు నాటడం, అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం ప్రారంభిస్తారన్నారు. ఈ రుద్రాభిషేకానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని సేవా సంస్థల సభ్యులు కోరారు.

రోజుకో గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరం



తాటిపాకలో హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యుడు

రాజోలు: ప్రతి రోజు ఒక గ్రామంలో హోమియో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణుడు కోసూరి రామకృష్ణానంద రాజు (డాక్టర్ పోడూరు రాజు) తెలిపారు. సోమవారం తాటిపాక సెంటర్‌లోని కనకదుర్గ గుడి సెంటరులో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన రోగులకు రామకృష్ణానంద రాజు టెలీకాలింగ్ ద్వారా వైద్య సలహాలు అందించారు. తమ సంస్థ అయిన పాలకొల్లు రామకృష్ణ పరమహంస హోమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.